క్లుప్తంగా

ముగిసిన మద్దలేశ్వరి ఉత్సవాలు



అమరచింత: పట్టణంలో వెలసిన మద్దలేశ్వరి మాత ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో భక్తులు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పాటేళ్లను బలిచ్చి తమ కుటుంబాలను చల్లగా చూడాలని మొక్కుకున్నారు. పట్టణంలోని పద్మశాలీలు అమ్మవారి నామంతో కూడిన కడ్గాలు చదువుతూ బోనాన్ని ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయంలో బోనానికి పూజలు చేసి ప్రసాదాన్ని పద్మశాలీలకు పంపిణీ చేశారు. బుధవారం రెండో బోనం సమర్పణతో అమ్మవారి ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు మహాంకాళి విష్ణు, కార్యదర్శి మహాంకాళి ప్రభాకర్ గౌండ్లు, మేటికాపులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి



పాన్‌గల్: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి వివరాలను ఆన్‌లైన్‌లో తప్పక నమోదు చేయాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ జయశంకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు యూడైస్ ప్లస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో మండల నోడల్ అధికారి శ్రీనివాసులు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు నరేందర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రూ.40 వేల ఆర్థిక సాయం

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని గుమ్మడంలో గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో వర్కర్‌గా పనిచేస్తున్న కృష్ణయ్య కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. నిరంతరం రైతులు, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించారు. అతడి యొక్క సేవలను గుర్తుకు చేసుకొని పాతపల్లి రైతులు, ప్రజలు, యువకులు రూ.40 వేలు పోగు చేసి బుధవారం గుమ్మడంలో బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో పాతపల్లి మాజీ సర్పంచ్ రవీందర్‌నాయుడు, నాగేష్, రామచంద్రయ్య, వెంకటయ్య, రాముడు, ఉషన్నయ్య, శ్రీనివాస్‌గౌడ్, ఉవనయ్య, శ్రీరాములు, బీచుపల్లి, మహేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇళ్లు



మదనాపురం: వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని దుప్పల్లిలో వహీద్‌కు చెందిన పెంకుటిల్లు బుధవారం కూలిపోయింది. అదే విధంగా చీర్ల రవి ఇల్లు పూర్తిగా దెబ్బతింది. ఆర్థికంగా ఇబ్బందుల్లో తమను ప్రభుత్వం ఆదుకొని ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఆత్మకూర్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రసన్నమీన జులై 5న మహబూబ్‌నగర్ నుంచి ఆర్టీసీ బస్సులో ఆత్మకూర్‌కు వస్తుండగా సెల్‌ఫోన్ చోరీకి గురైంది. ఆమె స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నూతనంగా వచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాలలో సెల్‌ఫోన్‌ను ఆచూకీ గుర్తించిన పోలీసులు దానిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం బాధితురాలికి ఫోన్ అప్పగించినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు.

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని తోమాలపల్లికి చెందిన మన్యం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీని గుర్తించి రికవరీ చేశామని ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో బాధితుడికి ఏఎస్‌ఐ శ్రీనివాసులు ఫోను అప్పగించారు.

గుడ్లగూబ అప్పగింత

ఆత్మకూర్: ప్రమాదవశాత్తు గాయపడిన గుడ్లగూబ పక్షిని ఫారెస్టు అధికారులకు అప్పగించినట్లు సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. బుధవారం మండలంలోని గుంటిపల్లి శివారులో గుడ్లగూబ గాయపడి ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు పక్షిని అప్పగించారు. దీంతో పోలీసులు స్థానిక వెటర్నరీ ఆస్పత్రిలో చికిత్స చేయించి ఫారెస్టు అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మదనాపురం ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది, గుంటిపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.



సులభతర బోధన

- జాతీయ నూతన విద్యావిధానం వర్క్‌షాప్‌లో టాయ్ పెడగాజీని ప్రతిపాదించిన మురళీకృష్ణ
- వెదురుతో బొమ్మలు చేసి పాఠ్యాంశాల బోధన
- ఎన్సీఈఆర్టీ, ఎస్‌సీఆర్ వెబ్, సెమినార్‌కు హాజరైన జిల్లా ఉపాధ్యాయుడు
- గతేడాది రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక

వనపర్తి: పర్యావరణాన్ని కలుషితం చేసే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, విద్యార్థులపై వత్తిడి పెంచే చదువులకు స్వస్తి పలకాలనే ఉద్దేశం ఉపాధ్యాయుడు మురళీకృష్ణది. ఈయన వెదురు కర్రతో బొమ్మలు తయారుచేసి చిన్నారులకు బోధన చేస్తున్నారు. నిత్య జీవనంలో వినియోగించే, వృథాగా ఉన్న ఇంట్లోని వస్తువులతో ఆట, గృహోపకరణ, ఆధునికంగా వాడుకలోకి వస్తున్న వస్తువులను తయారుచేసి విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా బోధిస్తూ వారి మనసుల్లో స్థానం సంపాదించుకుంటున్నారు. ఇప్పటికే కారు, మోటరుసైకిల్‌తో పాటు సైకిల్ పంపు, ఫ్లవర్‌వాజ్, విమానం, ఎద్దుల బండి, బస్సు, ఇల్లు తదితర సుమారు 50 నుంచి 60 రకాల బొమ్మలను తయారుచేసి వాటిని విద్యార్థులకు చూపిస్తూ.. వారితోనూ వెదురు, ఇతర వృథా వస్తువులతో బొమ్మలు తయారు చేయించడం, ఆడుకోవటం, చూస్తూ.. నేర్చుకోవడంతో విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందిస్తున్నారు. ఈ విద్యా విధానంతో విద్యార్థులు సెల్‌ఫోన్, టీవీలకు అంకితం కాకుండా సెలవు రోజుల్లో బొమ్మలు తయారు చేసే పనిలో నిమగ్నమవుతారు. దీంతో వారికి విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందుతాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా అన్ని అంశాలతో పాటు విద్యా విధానంలోనూ మార్పులు తీసుకురావాలని కోరుకుంటున్నారు. జాతీయ నూ తన విద్యావిధానంలో మార్పునకు ఎన్సీఈఆర్టీ, ఎస్‌సీఆర్‌టీ, వెబ్, సెమినార్‌తో పాటు గుజరాజ్, భూపాల్, మైసూరు తదితర ప్రాంతాల్లో జరిగిన వర్క్‌షాప్‌లలో ఆయన పాల్గొన్నారు.



వెదురుతో చేసిన బొమ్మలను చూపిస్తున్న ఉపాధ్యాయుడు మురళీకృష్ణ



వెదురుతో తయారు చేసిన విమానం, ఎద్దుల బండి, బస్‌ను చూపిస్తున్న విద్యార్థులు (ఫైల్)

సుస్థిర అభివృద్ధి కావాలి..

పర్యావరణ పరిరక్షణతో పాటు నిత్య జీవితంలో మానవాళికి కావాల్సిన విద్య, జీవన విధానాలను విద్యార్థులకు బోధించాలి. ఈ విధానంతో విద్యార్థులు అంశం ఏదైనా.. త్వరగా నేర్చుకోవడంతో పాటు ఎప్పటికీ గుర్తుంచుకుంటారు. అత్యధికంగా ఆక్సీజన్ ఇచ్చే చెట్లలో వెదురు మొదటి వరుసలో ఉంటుంది. గ్రామీణ ప్రాంతంలోనూ.. వెదురు సాగు పెరగాలి.

– మురళీకృష్ణ, ఉపాధ్యాయుడు, యాపర్ల (పెబ్బేరు)

రాష్ట్ర బృందంతో గుజరాత్ వర్క్‌షాప్‌నకు..

రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ సూచన మేరకు గతేడాది డిసెంబర్‌లో గుజరాత్ గాంధీ నగర్‌లోని ఐఐటీలో నిర్వహించిన జాతీయ నూతన విద్యావిధానం వర్క్‌షాప్‌కు తెలంగాణ బృందం తరఫునన హాజరై బొమ్మలతో బోధన అనే అంశంపై తన ప్రసంగాన్ని వినిపించారు.



పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

వనపర్తి: జిల్లాలో డెంగీ, మలేరియా తదితర సీజనల్ వ్యాధుల నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో మున్సిపల్, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం జ్వరం వచ్చిన ప్రతి వ్యక్తికి ఎలిజా పరీక్షలు చేయించాలని, ప్రైవేట్ ఆస్పత్రుల్లో నమోదైన కేసులను సైతం గుర్తించాలన్నారు. వ్యాధి సోకిన వ్యక్తి ఇంటితో పాటు పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాకేంద్రంలోని పీర్లగుట్ట ప్రాంతంలో ఇప్పటి వరకు 10 డెంగీ కేసులు నమోదయ్యాయని.. వారం పాటు రోజూ డ్రై డే కార్యక్రమం నిర్వహించాలని, దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని ఆదేశించారు.

జాతీయ పోషణ మాసం నిర్వహించాలి

జాతీయ పోషణమాసం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. ఈ నెల 30 వరకు నిర్వహించే కార్యక్రమంపై బుధవారం కలెక్టరేట్‌లో డీడబ్ల్యూఓశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ మాసంలో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి మంగళవారం అనీమియా, ఆరోగ్య సమస్యలున్న తల్లి, పిల్లలను సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించాలన్నారు. అనంతరం జాతీయ పోషణ మాసం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు తనవంతు కృషి చేస్తామని అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

క్రిటికల్ కేర్ యూనిట్ పనులు పూర్తి చేయాలి

క్రిటికల్ కేర్ యూనిట్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం ఎంసీహెచ్, రూ.23.75 కోట్లతో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ పనులను ఆయన పరిశీలించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మూసివేసి దుకాణాలు నిర్మించుకోవడం ఏమిటని.. వెంటనే తొలగించాలని ఆదేశించారు. 9వ తేదీన రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జిల్లా పర్యటనకు వస్తున్నారని.. ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్, ఓపీ రూమ్, హైమాస్ట్ లైట్లను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని టీజీఎంఐడీసీ ఇంజినీర్ జైపాల్‌రెడ్డిని ఆదేశించారు. అనంతరం టీ డయాగ్నొస్టిక్ హబ్, మాత, శిశు సంరక్షణ కేంద్రంలో లేబర్‌రూమ్, పిల్లల వార్డును సందర్శించి వైద్యులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రంగారావు, పుర కమిషనర్ పూర్ణచందర్, టౌన్ ప్లానింగ్ అధికారి కరుణాకర్, వైద్యులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళన



పుర మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

అమరచింత: కాలనీల్లో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలంటూ బుధవారం పట్టణంలోని 4, 5 వార్డుల ప్రజలు సీపీఐ నాయకులతో కలిసి పుర కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి అబ్రహం, పట్టణ కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ.. వార్డుల్లో ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాలు తొలగించాలని, మురుగుదొడ్లు నిర్మించాలని, ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లు కూలిన బాధితులకు వెంటనే కొత్త ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దళితకాలనీలని మున్సిపల్ అధికారులు వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ఐదోవార్డులో 1984లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు శిథిలావస్థకు చేరాయని.. మరమ్మతులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు. గత కొంతకాలంగా సమస్యలు పరిష్కరించాలని విన్నవించినా పుర అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వార్డుల్లో డ్రెయినేజీల నిర్మాణంతో పాటు అసంపూర్తిగా ఉన్న సీసీ రహదారుల పనులు పూర్తి చేయాలని కోరారు. అనంతరం సమస్యల వినతిపత్రాన్ని పుర మేనేజర్ యూసూఫ్‌కు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రవీందర్, శ్యాంసుందర్, కుతుబ్, ఇబ్రాయిల్, ఆయా కాలనీల మహిళలు పాల్గొన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి

ఆత్మకూర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశాభివృద్ధి పరుగులు పెడుతుందని, బీజేపీలో సభ్యత్వాలు తీసుకుని పార్టీని మరింత బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి అశోక్‌జీ అన్నారు. బుధవారం స్థానిక వర్తకసంఘం భవనంలో పట్టణ బీజేపీ నాయకుల సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 1 నుంచే బీజేపీ సభ్యత్వాలు నమోదు ప్రారంభమైందని, బూత్‌లెవల్ బాధ్యులు 88000 02024 నంబరుకు డయల్‌చేసి సభ్యత్వాలు నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో అనిల్‌గౌడ్, అశ్విన్‌కుమార్, తమ్మలివిజయ్, ఆనంద్, వెంకట్, విష్ణువర్ధన్‌రెడ్డి, రాము, ఎల్లన్న, మాసన్న, భగవంతురెడ్డి, అశోక్, సురేష్, లక్ష్మీనారయణ, బాలకృష్ణ, రాము, సూరి ఉన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని ప్రతి బూత్ నుంచి కనీసం 200 మందితో సభ్యత్వం చేయించాలని బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీజేపీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించి సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో రవినాయక్, విక్రం, దశరథం, సత్యనారాయణ, ఆశన్న, రాజు, వెంకటేష్, కృష్ణయ్య, కేశన్న, బెస్తరాజు, శివ, రామస్వామి, రాములు, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

కొత్తకోట రూరల్: అమడబాకులకు చెందిన బుడగ జంగం ఈశ్వరయ్యకు తొమ్మిదేళ్ల క్రితం వనపర్తి మండలం శ్రీనివాసపురం గ్రామానికి చెందిన బుడగజంగం మణెమ్మతో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు మగపిల్లలు ఉన్నారు. వీరి రెండో కుమారుడైన నరేష్‌కు ఇటీవల చేయి విరిగిపోవడంతో కట్టు కట్టించుకునేందుకు గత నెల 12న బైక్‌పై భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి అమడబాకుల నుంచి కొత్తకోట బస్టాండ్‌కు వచ్చారు. తనకు పని ఉందని, కుమారుడి చేయికి కట్టు కట్టించేందుకు నువ్వు వెళ్లు అని భార్యకు చెప్పి బస్టాండ్‌లో వనపర్తికి బస్సు ఎక్కించాడు. కుమారుడి చేతికి కట్టు కట్టించుకుని రెండు రోజుల తర్వాత మణెమ్మ అమడబాకులకు రావడంతో భర్త శంకరయ్య ఇంటి వద్ద లేకపోవడంతో పాటు ఫోన్ స్విచ్ఛాఫ్ ఉండటంతో ఆందోళనకు గురైంది. మణెమ్మ భర్త శంకరయ్య తండ్రి హన్మంత్‌కు ఫోన్ చేసి అడుగగా హైదరాబాద్‌లో ఉన్నానని వారం రోజుల తర్వాత వస్తానని చెప్పినట్లు తెలిపాడు. వారం రోజులు గడిచినా శంకరయ్య ఇంటికి రాకపోవడంతో బంధువులకు ఫోన్ చేసిన అడిగినా సమాచారం లేకపోవడంతో బుధవారం కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సైబర్ నేరస్తులతో అప్రమత్తంగా ఉండాలి



ఆత్మకూర్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్



కొత్తకోటలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి

ఆత్మకూర్: సైబర్ నేరగాళ్లతో యువత, విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ సూచించారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో సైబర్ నేరాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్నెట్ వినియోగం పెరిగిన తర్వాత సైబర్ నేరాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఫోన్లకు అపరచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్‌కు సంబంధించి ఓటీపీలు, బ్యాంకు వివరాలు, చెప్పొద్దని సూచించారు.

అమరచింత: సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచి పనులకు వినియోగించకుండా కొంతమంది సైబర్ నేరాలకు పాల్పడుతూ అమయాక ప్రజలను మోసం చేస్తున్నారని, అలాంటి వారితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సురేష్ అన్నారు. సైబర్ నేరాలపై యూనియన్ బ్యాంక్ వద్ద బుధవారం ఖాతాదారులకు అవగాహన కల్పించారు. కొంత మంది ఫోన్ చేసి బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని, మీ ఏటీఎం పనిచేయడం లేదని, నంబర్ చెప్పమని వాటికి వచ్చే ఓటీపీ చెప్పమని అడుగుతుంటారని అలాంటి ఫోన్‌కాల్స్‌కు సమాధానం ఇవ్వరాదన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ వలీ తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిస కావొద్దు

కొత్తకోట రూరల్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మత్తుకు బానిసలై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని కొత్తకోట ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని పాత జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో విద్యార్థులు, యువకులకు మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.

శాంతియుత వాతావరణంలో..

ఖిల్లాఘనపురం: ప్రజలంతా శాంతియుత వాతావరణంలో వినాయకుడి పండుగను జరుపుకోవాలని ఖిల్లాఘనపురం ఇన్‌చార్జ్ ఎస్‌ఐ నరేష్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మండల ప్రజలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన ప్రారంభమయ్యే వినాయక ఉత్సవాలను ప్రజలంతా కులమతాలకు అతీతంగా ఐకమత్యంతో జరుపుకోవాలన్నారు. అవాంఛనీయ ఘటనలు జరిగిన వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో సామ్య నాయక్, వెంకటరమణ, గంజాయి రమేష్, బాల్‌రెడ్డి, అజీమ్, విక్రం, యాదయ్య, గోపాల్, అంజనేయులుగౌడు, పాష, యాదగిరి, రవి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

గోపాల్‌పేట: గ్రామాల్లో ఒక్క సీసీ కెమెరా ఉన్నా వంద మంది పోలీసులు ఉన్నట్లేనని రేవల్లి ఎస్‌ఐ రాము అన్నారు. బుధవారం రేవల్లి మండలంలోని గౌరిదేవిపల్లిలో సీసీ టీవీలు ఏర్పాటుపై అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రతిఒక్కరూ ముందుకు వచ్చి విరాళాలు ఇవ్వాలని కోరారు. సీసీ కెమెరాలు ఉంటే గ్రామంలో కొత్త వ్యక్తులు ఎవరు వచ్చినా తెలుస్తుందని, దొంగతనాలు జరిగిన సమయంలో సీసీ టీవీలు ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు.

‘ఉపాధి’ పనులపై సామాజిక తనిఖీ

వనపర్తి రూరల్: పెబ్బేరు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అదనపు డీఆర్‌డీఓ నాగేంద్ర ఆధ్వర్యంలో బుధవారం 14వ విడత ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక ఏర్పాటు చేశామని ఎంపీడీఓ రవీంద్ర తెలిపారు. 2023–24 సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ పనులను సామాజిక తనిఖీ బృందాలు పది రోజుల నుంచి గ్రామాల వారీగా విచారణ చేశారని తెలిపారు. అధికారులు వాటి వివరాలను సమావేశంలో చదివి వినిపించారు. మండలంలోని గ్రామ పంచాయతీల్లో మొత్తం 601 పనులు చేపట్టగా.. కూలీలకు రూ.3.31కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి రహీం, అధికారులు సత్యనారాయణ రెడ్డి, ఏపీఓ అక్తర్‌నిసాబేగం, ఎస్సార్పీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

‘ఆపదలో రాజకీయాలు మాట్లాడడం సరికాదు’



మాట్లాడుతున్న సమన్వయకర్త లక్కాకుల సతీష్, మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్

వనపర్తి టౌన్: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరదలు రావడంతో ప్రజలు ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నారని, వీలైతే వారిని ఓదార్చి ధైర్యం చెప్పాలే తప్పా.. రాజకీయాలు చేయడం సరికాదని నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్, మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్ బీఆర్‌ఎస్ నాయకులకు హితవు పలికారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మంగళవారం మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాలతో వరదలు వస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కడికి పోయారని ప్రశ్నించడం సరికాదని, సీఎం ఖమ్మంలో వరద బాధితుల పరిస్థితిని తెలుసుకునేందుకు స్వయంగా వెళ్లాడన్నారు. నియోజకవర్గాల్లో వరద బాధితులకు అండగా నిలిచి, ప్రజలకు అందుబాటులో ఉండాలని మంత్రులు, ఎమ్మెల్యేలకు ఆదేశాలు జారీ చేశారని గుర్తుచేశారు. వర్షాల, వరదల కారణంగా ఇళ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, నష్టపోయిన రైతులను ఆదుకుంటామని సీఎం స్పష్టం చేశారన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, ఎల్‌ఐసీ కృష్ణ, జంపన్న, ద్యారపోగు వెంకటేష్, సూరి, రాజసింహారెడ్డి, సింగోటం, ఆయూబ్‌ఖాన్, రాములు, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం



కొత్తకోటలోని జయప్రకాష్ కాలనీలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న మున్సిపల్ సిబ్బంది

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని 6వ వార్డులోని జయప్రకాష్ కాలనీకి చెందిన జనగం మహేందర్ అనే మూడేళ్ల బాలుడికి మూడు రోజులుగా జ్వరం ఉండటంతో తల్లిదండ్రులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చూయించి రక్త నమూనాలు ఇచ్చారు. బుధవారం ఆసుపత్రి సిబ్బంది బాలుడికి డెంగీ సోకినట్లు నిర్ధారించారు. అప్రమత్తమైన వైద్య సిబ్బంది వెంటనే మున్సిపల్ కమిషనర్ ఎస్‌ఎన్ సూర్యకుమార్‌కు డెంగీ బారిన పడిన బాలుడి కుటుంబ వివరాలు అందించారు. దీంతో కమిషనర్ మున్సిపల్ సిబ్బంది, వైద్య సిబ్బందితో కలిసి డెంగీ బారిన పడిన బాలుడి ఇంటికి చేరుకుని డోజర్ సహాయంతో ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు రోడ్లు, డ్రైనేజీలు పొంగిపొర్లడంతో వర్షపు నీరు ఇళ్ల పరిసర ప్రాంతాలకు చేరిందని, వీటిలో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

జమ్మాపూర్‌లో రక్త నమూనాలు సేకరణ

పాన్‌గల్: మండలంలోని జమ్మాపూర్‌లో బుధవారం పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో డెంగీ అనుమానితుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా గ్రామంలో రాచూరి భరత్‌కు డెంగీ పాజిటివ్ రావడంతో వారి కుటుంబ సభ్యులతో పాటు ఇంటి పరిసరాలలోని కుటుంబ సభ్యుల నుంచి కూడా రక్త నమూనాలను సేకరించినట్లు డాక్టర్ పేర్కొన్నారు. గ్రామంలోని పలు కాలనీల్లో పర్యటిస్తూ డెంగీ నివారణ, పరిసరాల శుభ్రత, దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. జ్వరాలు సోకిన వ్యక్తులు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి సాజీద్‌రహమాన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ తారశాంక్, వైద్య సిబ్బంది సుమనశ్రీ, రాంచందర్, మదన్‌గోపాల్, సతీష్, తిరుపతయ్య, శైలజ, పంచాయతీ కార్యదర్శి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వీపనగండ్ల: ముసురు వర్షాలతో వైరల్ ఫీవర్లు వ్యాప్తి చెందే పరిస్థితులు నెలకొంటాయని, వాటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ అన్నారు. బుధవారం గోవర్ధనగిరిలో వైరల్ ఫీవర్, మలేరియా, డెంగీ తదితర జ్వరాలతో బాధపడే వారి కోసం ప్రత్యేక మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు కరుణశ్రీ, సూపర్‌వైజర్ విజయకుమారి, ల్యాబ్ టెక్నీషియన్ వెంకటేష్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



గోవర్ధనగిరిలో సూచనలిస్తున్న డా.రాజశేఖర్



పాన్‌గల్ మండలం జమ్మాపూర్‌లో..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వనపర్తి రూరల్: ప్రమాదవశాత్తు బైక్ నుంచి పడి ఇద్దరికి గాయాలయిన ఘటన శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల శివారులో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాన్‌గల్ మండలంలోని మల్లాయిపల్లికి చెందిన శేఖర్‌రెడ్డి, నాగిరెడ్డి బైక్‌పై తాటిపాముల గ్రామానికి వచ్చి తిరుగు ప్రయాణంలో గ్రామానికి వెళ్తుండగా.. బైక్ అదుపుతప్పి పడిపోయారు. వారికి తీవ్రగాయాలు కావడంతో గ్రామస్తులు 108లో వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ పాండునాయక్ తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని జగ్గాయిపల్లి, అంతాయపల్లి, షాపురం తండాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన గ్రామాల్లో నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు నివేదికలు పంపాలని ప్రభుత్వం కోరిందన్నారు.

కాల్వకు మరమ్మతు

కొత్తకోట రూరల్: ఇటీవల ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు మండలంలోని రామకృష్ణాపురం గ్రామ శివారులో గల రామన్‌పాడ్ కాల్వ కల్వర్టు ఒక వైపు కూలిపోయింది. దీంతో రామకృష్ణాపురం, పామాపురం గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. విషయాన్ని రామకృష్ణాపురం గ్రామ కాంగ్రెస్ నాయకులు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడి మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. బుధవారం పనులు చేపట్టిన అధికారులు కూలిపోయిన కల్వర్టును సరిచేయడంతో పాటు మట్టి పోశారు. సమస్య ఉందని చెప్పిన వెంటనే స్పందించిన ఎమ్మెల్యేకు ఇరు గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

వీపనగండ్ల: మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేస్తామని మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ బాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కల్వరాల గ్రామ సమీపంలో తెగిపోయిన భీమా కాల్వను వారు పరిశీలించారు. ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో మండలంలో నష్టపోయిన రైతులతో పాటు మట్టి మిద్దెలు కూలడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులకు గురైన వారిని ఆదుకునేందుకు అవసరమైన ఆర్థికసాయం కోరుతామని వారు అన్నారు. కార్యక్రమంలో రఘునాథ్‌రెడ్డి, వెంకటస్వామి, వెంకటరాజయ్య, ఉస్సేన్, చక్రవెంకటేష్, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రామన్‌పాడ్ కాల్వ కల్వర్టు మరమ్మతు చేయిస్తున్న కాంగ్రెస్ నాయకులు